అల్లూరి సీతారామరాజు

గర్భిణి, శిశువు మృతి

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని పట్టం పంచాయతీ డాబావలస గ్రామానికి చెందన గర్భిణీ, శిశువు మృతితో విషాధ చాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన గర్భిణీ పరదాని భవాని శుక్రవారం రాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. శుక్రవారం ఉదయం డాబావలస గ్రామం నుంచి ప్రసవం నిమిత్తం గర్భిణీ పరదాని భవాని మూడవ కాన్పు నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పాడేరులో వైద్య పరీక్షలు నిర్వహించారు. కొంత సేపటికి గర్భంలోని శిశువు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గర్భిణీ పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. గర్భిణీని తీసుకెళుతున్న క్రమంలోనే సబ్బవరం సమీపంలో ఆమె మరణించింది. కేజీహెచ్‌కు తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు గర్భిణీ మరణించిందని చెప్పడంతో కన్నీరు మున్నీరుగా బంధువులు విలపించారు.

భవాని (ఫైల్ ఫొటో)

విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు

అరకులో నిర్మిస్తున్న అక్రమ కట్టడం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గిరిజనులకు రక్షణ కవచంగా ఉన్న 1/70 భూ బదలాయింపు చట్టాన్ని ధిక్కరిస్తూ మండలంలోని పలు గ్రామాల్లో గిరిజనేతరులు విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు చేసుకుం టున్నారు. మండలంలోని అరుకు, కురిడి, కించుమండ పంచాయతీ కేంద్రాల్లో జోరుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. 1/70 చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరులు అక్రమంగా శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారు. చట్టానికి వ్యతిరేకంగా శాశ్వత గృహాలతో పాటు భవంతులను నిర్మిస్తున్నారు. ఆయా పంచాయతీ కేంద్రాల్లో పరదాల చాటున అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారు. అక్రమ నిర్మాణాలపై స్థానిక గ్రామస్తులు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోకుండా నిర్మాణాలు సాగిస్తున్నారు. దీంతో అధికారుల తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత రెవెన్యూ యంత్రాంగం స్పందించి గిరిజనేతరుల అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపి నిలుపుదల చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఈ విషయంపై స్థానిక ఆర్ఐ రామును వివరణ కోరగా... కురిడిలో జరుతుతున్న అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేయడం జరిగిందని, కించుమండ, అరుకులో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై విచారణ చేపట్టి గిరిజనేతరులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

కురిడిలో నిర్మాణం చేపడుతున్న అక్రమ కట్టడాలు

ఇంటింటికీ అందని రేషన్ సరుకులు!

- ★ ఏడాదిగా ఎండియు ఆపరేటర్ నిర్లక్ష్యం
- ★ 15 కిలోమీటర్లు కాలినడకన జిసిసి డిపోకు వచ్చి తీసుకుంటున్న లబ్ధిదారులు
- ★ ఆపరేటర్‌ను తొలగించాలని డిమాండ్

సప్పర్ల రేషన్ డిపో వద్ద సరుకులు తీసుకుంటున్న గాలికొండ పంచాయితీ ప్రజలు

ప్రజాశక్తి-సీలేరు

జీకే.వీధి మండలం గాలికొండ పంచాయితీ జంపర్‌లోవ జిసిసి డిపో పరిధిలో తెల్లరేషన్ కార్డుదారులకు ఇంటింటికి రేషన్ సరుకులు ఏడాదిగా అందించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేషన్ సరుకులను ఇంటింటికీ పంపిణీ చేయాల్సిన మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) ఆపరేటర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీంతో వ్యయ ప్రయాసలకోర్చి జిసిసి డిపోకు వచ్చి రేషన్ తీసుకోవాల్సిన దుస్థితి నెలకొందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీకే.వీధి మండలం గాలికొండ పంచాయితీ జంపర్‌లోవ జిసిసి డిపో పరిధిలో 300 మంది తెల్ల రేషన్ కార్డుదారులు ఉన్నారు. వీరికి ఎండియు ఆపరేటర్ గోవిందు ఇంటింటికి వెళ్లి ప్రతి నెల రేషన్ సరుకులు అందజేయవలసి ఉంది. కాని వైసిపి ప్రభుత్వంలో ఐదు నెలలు, టిడిపి కుటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ఏడు నెలల నుంచి అంటే ఏడాదిగా ఆపరేటర్ గోవింద ఇంటింటికి వెళ్లి రేషన్ సరుకులు పంపిణీ చేయడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. దీంతో గాలికొండ పంచాయతీ పరిధి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సుమారు 15 కిలోమీటర్లు కాలినడకన సప్పర్ల జిసిసి డిపోకి వచ్చి రేషన్ సరుకులు తీసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొందని చెబుతున్నారు. దీని వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రేషన్ లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండియు ఆపరేటర్ నిర్లక్ష్యంపై అనేకసార్లు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు, జీకే వీధి తహశీల్దారుకు ఫిర్యాదు చేసినట్లు రేషన్ లబ్ధిదారుడు ఇరిమయ్య చెప్పారు. అయితే ఇప్పటివరకు ఆయనపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్నాడని పేర్కొన్నారు. ఎండియూ ఆపరేటర్ విధి నిర్వహణ చేయకపోయినా జీతాలు ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎండియు ఆపరేటర్ గోవిందను తక్షణమే తొలగించాలని, ప్రతి నెలా ఇంటింటికి రేషన్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వారపు సంతకు సంక్రాంతి కళ

సంతకు తరలి వచ్చిన గిరిజనులు

ప్రజాశక్తి-హుకుంపేట: సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కేంద్రంలోని శనివారం జరిగిన వారపు సంతకు భారీగా గిరిజనులు తరలివచ్చారు.కొత్త దుస్తులు, సామగ్రి కొనుగోలు చేసేందుకు పరిసర మండలాల్లో నుంచి కుటుంబ సమేతంగా గిరిజనులు రావడంతో సంత ప్రాంగణమంతా కిక్కిరిసింది. మెయిన్ రోడ్డు, పెట్రోల్ బంకు జంక్షన్ నుంచి కామయ్యపేట జంక్షన్ వరకు, జూనియర్ కాలేజ్ తదితర ప్రాంతాలు కిక్కిరిసి పోయాయి. వస్త్ర వ్యాపారం భారీగా జరిగింది. గిరిజనులు పండించిన అటవీ ఉత్పత్తులను అమ్మకాలు చేపట్టి కుటుంబ సభ్యులకు వస్త్రాలు, నిత్యావసర వస్తువులు కొనుగోలు చేశారు. జైపూర్ నుంచి సంక్రాంతి పండుగ సందర్భంగా తుడుములు అమ్మకానికి తీసుకొచ్చారు. చిన్నది రూ.1800, పెద్దది 3000 వరకు అమ్మకాలు సాగాయి. గిరిజన ప్రాంతాల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా తుడుములను ఉపయోగిస్తారు. కోళ్లు మేకలు అమ్మకాలు భారీగా సాగాయి. నాటు కోటి, రూ.800 నుంచి 2000, మేకలు రూ. 7000 నుంచి 16000 వరకు విక్రయాలు సాగాయి. కూరగాయల కొనుగోలు భారీగా జరిగాయి.

సంతలో చేపడుతున్న మేకల విక్రయాలు

శాండికోరిలో విద్యుత్ వైర్లు ఏర్పాటు

ప్రజాశక్తి కథనానికి స్పందించిన అధికారులు

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ శాండికోరి గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆ శాఖ అధికారులు శనివారం కొత్త వైర్లు ఏర్పాటు చేశారు. శాండికోరి గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తెగి షార్టు సర్క్యూట్ కావడంతో ప్రజలు భయాందోళన చెందుతున్న వైనంపై 'తెగిన విద్యుత్ వైర్లు' శీర్షికను ప్రజాశక్తి శనివారం కథనం ప్రచురించిన విషయం విధితవే. ఈ కథనానికి ఎపి ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. శనివారం శాండికోరి గ్రామానికి వెళ్లి ప్రమాదపుటంచున ఉన్న వైర్లను తొలగించి వాటి స్థానంలో నూతన విద్యుత్ వైర్లు ఏర్పాటు చేశారు. ముందు ముందు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని లైన్‌మెన్ రాంబాబుకు ఆదేశించారు. అలాగే పగలు కూడా వీధిలైట్లు వెలుగుతున్న విద్యుత్ స్తంభం వద్ద కొత్త ఆన్ ఆపు డిపి స్విచ్ ఏర్పాటు చేశారు. సకాలంలో ట్రాన్స్‌కో సిబ్బంది స్పందించి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టినందుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ స్తంభం వద్ద మరమ్మతులు చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

కాఫీ పండ్ల సేకరణలో లక్ష్యాలు సాధించకుంటే చర్యలు

ఐటిడిఎ పిఒ అభిషేక్

మాట్లాడుతున్న పిఒ

ప్రజాశక్తి-పాడేరు : కాఫీ పళ్ళు సేకరణ లక్ష్యాలు సాధించకపోతే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి .అభిషేక్ హెచ్చరించారు. శనివారం ఐటీడీఏ కార్యాలయంలో అరకు నియోజక వర్గం మండలాల కాఫీ ఏఈవోలు, ఫీల్డ్ కన్సల్టెంట్లు, హార్టికల్చర్ కన్సల్టెంట్లతో కాఫీ పండ్ల సేకరణ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 20వ తేదీ నాటికి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. అరకు నియోజకవర్గ పరిధిలోని సిబ్బంది పనితీరు మార్చుకోవాలని ఆదేశించారు. కాఫీ ప్రాజెక్ట్ ను నిర్వహించడానికి క్షేత్రస్థాయి సిబ్బంది కష్టపడి పని చేయాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన లక్ష్యాలు సాధించిన సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని చెప్పారు. కాఫీ పండ్ల సేకరణలో 50 శాతం లక్ష్యాలు సాధించిన సిబ్బందిని కొనసాగిస్తామని, సాధించలేని సిబ్బందిని ఉద్యోగాల నుండి తొలగిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం. వెంకటేశ్వరరావు, ఏఈవోలు, ఫీల్డ్ కన్సల్టెంట్లు, హార్టికల్చర్ కన్సల్టెంట్లు పాల్గొన్నారు.

ఉదయం వేళలోనూ.. విద్యుత్ వెలుగులు!

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రం డుంబ్రిగుడ మెయిన్ రోడ్డు కిరువైపులా ఏర్పాటు చేసిన వీధిలైట్లు రాత్రి వేళలతో పాటు ఉదయం కూడా వెలుగుతున్నాయి. రాత్రులు చిమ్మ చీకటిగా ఉండకుండా వీధిలైట్లను ఏర్పాటు చేశారు. ఉదయం కూడా వీధి దీపాలు ఆఫ్ చేయకుండా వదిలేస్తుండడంతో వెలుగుతున్నాయి. రోజంతా లైట్లు వెలిగి ఉండటంతో అవి మరమ్మతుకు గురవుతున్నాయి. మరమ్మతుకు గురైతే వాటిని వెంటనే అధికారులు పునరుద్ధరించక పోవడంతో చిమ్మ చీకటిలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు అంటున్నారు. తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి వీధి దీపాలను రాత్రులు వెలిగించి ఉదయం ఆఫ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వెలుగుతున్న విద్యుత్ దీపం

సాయం చేస్తున్న యూనియన్ నాయకులు

ఆటో డ్రైవర్ కుటుంబానికి సాయం

ప్రజాశక్తి -చింతపల్లి: అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 7న చిలికల వీధి గ్రామంలో మృతి చెందిన ఆటో డ్రైవర్ ఉల్లి బాబురావు కుటుంబానికి ఆటో యూనియన్ మండల అధ్యక్షుడు సంపరి రమణ చేతుల మీదుగా ఆర్థిక సహాయం చేయడం జరిగిందని లోతుగడ్డ జంక్షన్ సిద్ధి వినాయక యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్, అరుణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బాబురావు ఆటో నడుపుకుని కుటుంబాన్ని పోషించుకునే వాడని, ఆయన మరణంతో కుటుంబం చిన్నాభిన్నమైందన్నారు.50 కేజీలు బియ్యం, నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం చేయడం జరిగిందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో అభి, చిన్న, రాము, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు పనులు ప్రారంభం

ప్రజాశక్తి రావికమతం : మండలంలో గుడ్డిప గ్రామంలో మంచినీటి బోరు పనులను సర్పంచ్ గుమ్మాల గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పశువుల పాకల వద్ద మంచినీటి సదుపాయం లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా ఎంపీపీ పైలరాజు దృష్టికి తీసుకు వెళ్లామన్నారు.దీంతో గల్లా వారి పాకల వద్ద శనివారం బోరు వేయడం జరిగిందన్నారు. మంచినీరు కావాలంటే ఇంటి దగ్గర నుంచి ప్రతిరోజు తీసుకు వెళ్లడం రైతులకు చాలా కష్టమన్నారు. ఇకనుంచి ఈ ఇబ్బందులు తొలగినట్లేనని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడ్డూరి సత్యారావు, గల్లా శ్రీను, గల్లా సత్యారావు పాల్గొన్నారు.

రహదారి పనులు పూర్తి చేయాలి

మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి

ప్రజాశక్తి-రంపచోడవరం

మండల కేంద్రం నుండి రంప గ్రామానికి వెళ్లే రహదారి పనులు పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గుంతలు పూడ్చి తారు రోడ్డు వేసేందుకు పనులను ప్రారంభించిందని తెలిపారు. ఇందులో భాగంగా రోడ్డుపై మెటల్ వేసి రోలింగ్ చేసి మూడు వారాల నుండి రోడ్డు పనులు నిలిచిపోవడంతో ఏ కారణం చేత ఆగిపోయిందో ప్రజలకు అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రంప శివాలయాన్ని, జలపాతాన్ని చూసేందుకు ప్రతిరోజు వందల సంఖ్యలో వాహనాలు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తాయని, దీని వల్ల రోడ్డుపై దట్టంగా దుమ్మూధూళి ఎగసి పడుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఊపిరితిత్తులు పాడై శ్వాస సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి రోడ్డు పనులను త్వరితన పూర్తి చేయాలని వెంకటేశ్వరరావు కోరారు.

నాటు వైద్యం, పసర మందుకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-సీలేరు : నాటు వైద్యం, పసర మందులకు దూరంగా ఉండాలని ధారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ డీకే హిమబిందు అన్నారు. గూడెం కొత్తవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ శివారు గ్రామమైన కొండజర్త గ్రామంలో శనివారం ధారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి డీకే హిమబిందు, వైద్య సిబ్బంది చెరుకుమల్లు గ్రామం నుంచి 8 కిలోమీటర్లు కాలినడకన ఆ గ్రామానికి వెళ్లారు. గ్రామంలో 69 మంది గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ముగ్గురు జ్వర బాధితులకు రక్తపూతలు సేకరించి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణం పరిస్థితుల వల్ల గిరిజన గ్రామాల్లో అతిసార, జ్వరాలు ప్రబలుతున్నాయని తెలిపారు. జ్వర బాధితులు ఆసుపత్రికి వచ్చి రక్త పరీక్ష చేయించుకోవాలని సూచించారు. జ్వరాలను నిర్లక్ష్యం చేయరాదని, మలేరియా నిర్ధారణ జరిగితే క్రమంగా మందులు వాడాలన్నారు. గిరిజనులు మంచులో తడవకుండా, చలి నుండి రక్షణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గర్భిణులు ఆసుపత్రిలోనే ప్రసవం పొందాలని, ప్రసవ సమయానికి 10 రోజులు ముందుగానే ఆసుపత్రిలో చేరాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఓ పోతురాజు, ఏఎన్ఎంలు సీతా, మత్స్య కొండ, పారామెడికల్ సిబ్బంది బాలకృష్ణ, భాస్కర్ పాల్గొన్నారు.



గ్రామానికి కాలినడకన వెళ్తున్న హిమబిందు, సిబ్బంది

చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్ హిమబిందు

ఆదివాసీ కొండరెడ్ల సంఘం ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలో జీడిగొప్ప గ్రామంలో శనివారం ఆదివాసీ కొండ రెడ్ల సంఘం ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ముందుగా జెండా ఆవిష్కరణ చేశారు. సంఘం జిల్లా నాయకులు ముర్ల కనకారెడ్డి, సీనియర్ నాయకులు వాళ్ల కృష్ణారెడ్డి, కదల కొండారెడ్డి, ముర్ల జగపతిరెడ్డి, కనుగుల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు అమరవీరుల చిత్రపటాలకు పూలాభిషేకం చేసి నివాళులర్పించారు. అనంతరం కనుగుల రవీంద్రరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ముర్ల కనకారెడ్డి మాట్లాడుతూ కొండ రెడ్లకు విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగాలలో తొలి ప్రాధాన్యత కల్పించాలని, ఐటిడిఎ కార్యాలయాల్లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని, అభివృద్ధి కోసం ప్రభుత్వాలు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు. పతి కొండరెడ్ల కుటుంబాలకు వైఏపీ కార్డులు ద్వారా 35 కేజీల బియ్యం ఇవ్వాలన్నారు. కూనవరం మండలంలోని కొండరెడ్ల గ్రామాలలో రోడ్లు, అన్ని మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం సంఘం నాయకులు కథల కొండారెడ్డి, మురళి జగపతిరెడ్డి, శ్యామల వెంకటరెడ్డి, కథల జనార్ధన్‌రెడ్డి, కథల సత్యనారాయణరెడ్డి, అందాల శ్రీరామ్‌మూర్తి రెడ్డి, కథల గణేష్ రెడ్డి, ముర్ల రత్నాకర్ రెడ్డి, కోట్ల శివారెడ్డి, ముర్ల శివశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సంఘం నాయకులు

దుస్తులు ఇస్తున్న కృష్ణకుమారి

గిరిజనులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:అరకు సంత బయలులోని పివిటిజి కాలనీలో మహిళలకు, చిన్నారులకు హెచ్ ఆర్‌ఎసిఎ రాష్ట్ర ఏజెన్సీ మహిళా విభాగ కె కృష్ణకుమారి ఆధ్వర్యంలో చీరలు, బట్టలను శనివారం పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, నిరుపేద గిరిజనులకు ఎంతో కొంత సేవలందించాలన్న లక్ష్యంతో ఈ పని చేస్తున్నామని ఆమె చెప్పారు. ఆ సంఘం ప్రతినిధి సింహాచలం, పివిటిజి మహిళలు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న డిఆర్‌ఓ

వడ్డే ఓబన్నకు ఘన నివాళి

ప్రజాశక్తి-పాడేరు: కలెక్టరేట్ కార్యాలయంలో స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. శనివారం వడ్డే ఓబన్న చిత్ర పటానికి డి.ఆర్.ఓ. కె.పద్మ లత పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో శనివారం భక్తులు పోటెత్తారు. పలు ప్రాంతాల నుండి భక్తుల తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.ఆలయ అర్చకులు ప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పుష్ప తోటలో గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా వైభవంగా తిరువీధి సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆయుర్వేద వైద్యుడు నియామకం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని వేంపాడు ఆయుర్వేద ఆసుపత్రి నూతన వైద్య అధికారిగా డాక్టర్ రఘు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఆయన వేంపాడు ఆయుర్వేద ఆసుపత్రిలో బాధ్యతలు స్వీకరించారు. గత 16 నెల నుంచి ఎలమంచిలి ఆయుష్ డాక్టర్ విజయ్ కుమార్ ఇన్చార్జిగా పని చేశారు.ఆయన స్థానంలో వేంపాడుకు రెగ్యులర్ డాక్టర్ ను ఆయుష్ కమిషనర్ నియమించారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘు మాట్లాడుతూ, ఎటువంటి దుష్ప్రభావం లేని ఆయుర్వేద వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బోరుబావి ప్రారంభం

ప్రజాశక్తి- భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధి బోయివీధిలో జివిఎంసి నిధులతో ఏర్పాటుచేసిన తాగు నీటి బోరును గ్రామ పెద్దలు కె.దుర్గారావు, కె.కాశీదు శనివారం ప్రారంభించారు.

కాలువల మరమ్మతు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-చింతపల్లి :తాజంగి రిజర్వాయర్ కుడి ఎడమ కాలువల మరమ్మతు పనులను నీటి సంఘం చైర్మన్ బోనంగి బాలయ్య పడాల్ , తాజంగి సర్పంచ్ వంతల మహేశ్వరి శంకుస్థాపన చేశారు. పనులు వేగవంతం చేసి రైతులకు రెండవ పంట వేసేకోవడానికి అనువైన వాతావరణం కల్పిస్తామని నీటి సంఘం చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పి కాంతమ్మ, నీటి సంఘం వైస్ చైర్మన్ తమరాభ విశ్వనాధం, విద్యా కమిటీ చైర్మన్ శెట్టి మోహనరావు, బోనంగి వెన్నలింగేశ్వరరావు, మినుములు సుందరావు, కిముడు శ్యాం సుందర్, ఉగ్రంగి. లక్ష్మణరావు, రీమల బాబూరావు పాల్గొన్నారు.

శంకుస్థాన చేస్తున్న చైర్మన్ బాలయ్య పడాల్, సర్పంచ్ మహేశ్వరి తదితరులు

భూగర్భ జలాల స్థితిగతులపై నివేదిక

ప్రజాశక్తి రావికమతం:మండలంలో గుడ్డిప గ్రామంలో సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ వారు భూగర్భ జలాల పరిస్థితిని ఎంపియుపి స్కూల్ సమీపంలో శనివారం డ్రిల్లింగ్ మిషన్ ద్వారా పరిశీలించారు. మినిస్ట్రీ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఆధ్వర్యంలో శ్రీ సాయి బోర్వెల్స్ ద్వారా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జల శక్తి సూపర్వైజర్ భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూగర్భ జలాల నాణ్యత, అభివృద్ధి, కాలుష్యం వంటి స్థితిగతులను ప్రతి 8 నెలలకు ఒక మారు పరిశీలించడం జరుగుతుందన్నారు. భూగర్భ జల శాఖ గుర్తించిన ప్రాంతాలలో భూమిలో నీరు ఏ పరిస్థితుల్లో ఉన్నది అన్న విషయాన్ని ఆయా గ్రామాలలో నీటిని పరిశీలన చేసి తగు నివేదికను ప్రభుత్వానికి అందజేయడం జరుగుతుందన్నారు. ఈ రిగ్గు మిషను ద్వారా భూమిలోకి 420 అడుగుల వరకు వెళ్లి నీటి నాణ్యతను పరిశీలించడం జరుగుతుందన్నారు. ప్రజలు మంచినీటికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు గాను, అలాగే కలుషితమైన నీటిని తాగడంతో అనేకమంది ప్రజలు అనారోగ్యం బారిన పడిన పరిస్థితిని చూస్తున్నామన్నారు. .అటువంటి పరిస్థితిని అధిగమించేందుకు గాను కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మజ్జి అప్పారావు(కొండయ్య), పిల్ల అచ్చం నాయుడు, ఎంపియుపి స్కూల్ చైర్మన్ గల్లా స్వామి, సోషల్ మీడియా ప్రతినిధి గల్లా నాని బాబు, పిల్లా రమణ ,పెద్దాడ అప్పారావు, జి సత్యా రావు, పిల్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.

తిరుపతి మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ఇటీవల తిరుపతి ఘటనలో మృతి చెందిన బొడ్డేటి నాయుడుబాబు కుటుంబానికి అండగా ఉంటామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ తెలిపారు. తిరుపతి తొక్కిసలాటలో మృతి చెందిన బొడ్డేటి నాయుడు బాబు కుటుంబాన్ని మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లిలో కుటుంబాన్ని శనివారం విజయ్ పరామర్శించారు. కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో ఫోన్ లో మాట్లాడించి ధైర్యంగా ఉండాలని చెప్పారన్నారు. నాయుడుబాబు లేని లోటు కుటుంబానికి తీరనిదని, పార్టీ తరఫున అండగా ఉంటామని తెలిపారు. నాయుడుబాబు తెలుగుదేశం పార్టీలో కీలక కార్యకర్తగా ఉండి అనేక సేవలు అందించారని గుర్తు చేశారు. కుటుంబానికి ప్రభుత్వం రూ. 25 లక్షలు, పార్టీ నుంచి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు, రాజాల నాయుడు, రెడ్డి అప్పల నాయుడు, బొడ్డేపల్లి టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఊరికెళ్తున్నారా..జాగ్రత్తలు తీసుకోండి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: సంక్రాంతి పండుగకు ఊరు వెళ్తున్న వారంతా తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక టౌన్ సిఐ గోవిందరావు సూచించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, సంక్రాతి పండుగకు సొంత ఊరికి వెళుతున్న వారంతా బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలన్నారు. లేదంటే ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోవా లన్నారు. బీరువా తాళాలను ఇంట్లో ఉంచరాదని, వెంటే తీసుకెళ్లాలని సూచించారు. ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉండే తాళం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఊరికి వెళుతున్న వారంతా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇస్తే ఇళ్లపై నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా చైన్స్‌తో లాక్ వెయడం మంచిదన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీసులకి, డయల్ 100 కి సమాచారం అందించాలని సీఐ కోరారు.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరు దుర్మరణం

ప్రజాశక్తి-యలమంచిలి : ఎర్రవరం జాతీయ రహదారి 16 ఫుర్ డాబా సమీపంలో శనివారం ఉదయం ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో పెదపల్లికి చెందిన బొద్దపు త్రినాధరావు (52) అనే వ్యక్తి దుర్మరణం చెందినట్లు పోలీసులు తెలిపారు. టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. శవ పంచనామా చేసి అనంతరం మృత దేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు టౌన్ ఎస్ఐ సావిత్రి దర్యాప్తు చేస్తున్నారని పోలీసు వర్గాలు తెలిపాయి.

నేరాలు ఘోరాలు

లారీ క్లీనర్ మృతి

ప్రజాశక్తి-చింతపల్లి:జాతీయ రహదారి.516 ఇ కొత్తగా నిర్మాణం చేపడుతున్న రోడ్డు పనుల్లో విషాధం చోటు చేసుకుంది. మండలంలోని రాజుపాకలు గ్రామ సమీప వంతెన వద్ద లారీ క్లీనర్ మృతి చెందాడు. ప్రాథమికంగా అందిన సమాచారం మేరకు.. జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా లారీలో క్లీనర్ వెంటేష్ పనిచేస్తున్నాడు. ట్యాంకర్ లారీ బ్రేకులు ఫెయిల్ అయ్యిందని డ్రైవర్ చెప్పగానే ఆత్మరక్షణకు లారీ నుండి వెంకటేష్ దూకాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డుపై క్లీనర్ మృతదేహం

పట్టుబడ్డ గంజాయి నిందితులతో పోలీసులు

160 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి-హుకుంపేట: గంజాయి ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారని స్థానిక ఎస్ఐ ఎల్ సురేష్ అన్నారు. మండల కేంద్రంలోని కొంతిలీ జంక్షన్ వద్ద వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. పెద్దబయలు గ్రామం నుంచి ఎస్.కోటకు కారులో సుమారు 160 కేజీల గంజాయిని తరలిస్తుండగా ఇద్దరు నిందితులు శనివారం పట్టుబడ్డారని స్థానిక ఎస్సై సురేష్ తెలిపారు. ఇద్దరు వ్యక్తులతో పాటు కారును సీజ్ చేసి హుకుంపేట స్టేషన్ కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్ కీ తరలించినట్లు ఎస్సై తెలిపారు.

9 మంది జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం దొండపూడి శివారు తోటల్లో కోడిపందాలు ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి నాలుగు కోడిపుంజులు, రూ.810 నగదు, ఏనిమిది ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు కొత్తకోట ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. కోడిపందాలు ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేశామన్నారు.గ్రామాలలో కోడిపందాలు, జూదాలు నిర్వహిస్తే తమకు సమాచారం అందివ్వాలని ఎస్సై కోరారు.

బావిలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కె.కోటపాడు : ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఉదంతం మండలంలోని ఆర్‌వై.అగ్రహారంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... గ్రామానికి చెందిన గొర్లి అప్పారావు (78) ఈ నెల 4వ తేదీ శనివారం ఉదయం ఇంటి నుండి వెళ్లగా ఆ రోజు నుండి కనిపించలేదు. దీనిపై అతని కుమారుడు గొర్లి అప్పారావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా ఈ నెల 11న శనివారం వారాడ శివారు ఎడ్లవానిపాలెం వద్ద వ్యవసాయ బావిలో మృతదేహాన్ని స్థానికులు గమనించి తెలియజేశారు. దీంతో కుమారుడు అప్పారావు ఈ సంఘటనపై ఏ.కోడూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఎన్టీఆర్ ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రికి తరలించారు.

ప్రైవేటు దోపిడీ

- పండగ పేరిట టికెట్ ధరలను భారీగా పెంచిన ట్రావెల్స్ నిర్వాహకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సంక్రాంతి పండగ వస్తే సొంత ఊళ్లకు వెళ్లాలన్న తాపత్రయం చాలా మందికి ఉంటుంది. ఆర్‌టిసి, రైల్వే, విమాన టికెట్లు లభించకపోవడంతో చాలా మంది ఇప్పుడు ప్రైవేట్ బస్ సర్వీసులను ఆశ్రయిస్తున్నారు. దీనిని అదునుగా చేసుకుని ప్రైవేట్ బస్సుల యాజమాన్యాలు భారీగా రేట్లు పెంచి ప్రయాణికుల జేబులు ఖాళీ చేస్తున్నాయి. నగరంలో ఏటా ఈ తంతు జరుగుతున్నా అధికార యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. ప్రయాణం తప్పనిసరి కావడంతో భారీ మొత్తాన్ని చెల్లించి ప్రైవేట్ బస్సుల్లోనే ప్రయాణం చేయాల్సి వస్తోంది. విశాఖ నగరంలో జరుగుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ దందాను ఓసారి పరిశీలిస్తే విస్మయం కలుగకమానదు.

ప్రైవేటు బస్సులకు డిమాండ్ పెరగడంతో వారం రోజుల కిందట ఉన్న ధరల కన్నా 50 నుంచి 100 శాతం వరకు టిక్కెట్ ధరలను పెంచేశారు. హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి విశాఖకు అత్యధిక సంఖ్యలో ప్రయాణికులు వస్తూ ఉంటారు. దీంతో ఆయా మార్గాలలో ప్రయాణించే బస్సుల ఛార్జీలను గణనీయంగా పెంచేశారు. ఈ నెల ఒకటిన హైదరాబాద్ నుంచి విశాఖపట్నం రావాలంటే ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో టికెట్ రూ.1500 నుంచి రూ.2000 వరకు ఉండేది. శనివారానికి ఆ టికెట్ రేట్లను పరిశీలిస్తే రూ.3,200 రూపాయలు వరకు పెరిగింది. 14వ తేదీకి టికెట్ తీసుకుందామని వెళ్లిన ప్రయాణికులకు ప్రైవేట్ బస్సుల యాజమాన్యం గట్టిగానే షాక్ ఇచ్చాయి. ఆ రోజు టిక్కెట్ ధరను రూ.5700 వరకు పెంచేశాయి. దీనిని బట్టి ప్రైవేటు ట్రావెల్స్ దందా ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అటు నుంచి వచ్చే ప్రయాణికులు మాత్రమే కాకుండా ఇటు విశాఖ నుంచి విజయవాడ, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లే ప్రయాణికులకు కూడా ఇదే స్థాయిలో ఛార్జీల మోత మోగించారు. విజయవాడ వెళ్లేందుకు ఈ నెల 7వ తేదీ వరకూ ఎసి స్లీపర్ సీటు రూ.1200, నాన్ ఎసి స్లీపర్ సీటు రూ.900 ఉండగా, 16, 17 తేదీలలో ఎసి స్లీపర్ ధరను రూ.1500 నుంచి రూ.2500 వరకు పెంచారు. హైదరాబాద్ వెళ్లటానికి విశాఖ నుంచి ఈ నెల 7 వరకు ఎసి స్లీపర్ రూ.1500 నుంచి రూ.2000, నాన్ ఎసి రూ.1060 నుంచి రూ.1500 ఉండగా వీటి ధరలు 15, 16 తేదీలలో ఎసి స్లీపర్ రూ.3200 నుంచి రూ.5800 మధ్య పెరిగింది. బస్సుల కేటగిరీని దృష్టిలో ఉంచుకొని నాన్ ఎసి స్లీపర్ ధరను రూ.2500 నుంచి రూ.3200కు పెంచేశారు. అలాగే విజయవాడ నుంచి తిరుగు ప్రయాణాలు అధికంగా ఉంటాయి కాబట్టి 16, 17 తేదీలలో ఎసి స్లీపర్ టిక్కెట్ ధర రూ.1500 నుంచి రూ.2500 మధ్య ఉంది. నాన్ ఎసి స్లీపర్ రూ.1500, అదే నాన్ ఎసి చైర్ అయితే రూ 970 నుంచి రూ.1100 మధ్య ధర పలుకుతోంది. విశాఖ నుంచి నిత్యం విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, చెన్నయ్ నగరాలకు 54 ట్రావెల్ సంస్థలకు చెందిన 110 బస్సులు వెళుతుంటాయి. పండగ సీజన్‌లో వీటి సంఖ్య కొంత వరకు పెరుగుతుంది. సంక్రాంతి పండగ రోజులలో వేర్వేరు ప్రదేశాల నుంచి ప్రతి రోజు మూడు వేల మంది నగరానికి వస్తారు. వీరంతా పండగ తర్వాత తిరుగు ప్రయాణాలు చేయాల్సి ఉంటుంది. వీరందరిపైనా టిక్కెట్ భారం పడుతుంది.

న్యాయం చేయరూ..

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తనను నిత్యం వేధిస్తున్న భార్య, ఆమె సోదరుని నుంచి రక్షించాలంటూ విఎంఆర్‌డిఎలో పనిచేస్తున్న అంధ ఉద్యోగి, మూర్ఛ రోగి ఎస్.శ్రీధర్ కోరారు. తన సమస్యలపై శనివారం డాబా గార్డెన్స్‌లోని విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విఎంఆర్‌డిఎలోని తన ప్రభుత్వ ఉద్యోగం కోసం తన భార్య, ఆమె సోదరుడు మానసికంగా వేధించడమే కాకుండా చంపేస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. దారి కాసి భౌతిక దాడులు చేస్తున్నారని తెలిపారు.

విద్యాలయాల్లో సంక్రాంతి వేడుకలు

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు రంగవల్లులు, మేహింది, కేశాలంకరణ, సాంప్రదాయ వస్త్ర ధారణతో అలరించారు. ఖోఖో, కబడ్డీ, మ్యూజికల్ చైర్ వంటి పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అధ్యాపకులు విద్యార్థులు కలిసి కళాశాలలో బోగిమంటలు వేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె రత్న మాణిక్యం సంక్రాంతి పండుగ విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ యం.శేఖర్, అధ్యాపకులు జి వెంకటరావు, ఆర్‌సిహెచ్ నాగేశ్వరరావు, జి హారతి, డాక్టర్ వై పద్మ, కె శకుంతల, యస్ అప్పనమ్మ, కె శైలజ, యన్ రమేష్, జి సాయికుమార్, బి శ్రీనివాసరావు, మూర్తి, సంగం నాయుడు, సినయ్య, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతూరు కళాశాలలో సాగుతున్న సంక్రాంతి సంబరాలు

ఎటపాక : స్థానిక డాక్టర్ పాల్ రాజ్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంగణంలో సంక్రాంతి పండుగను విద్యార్థులు, సిబ్బంది ఘనంగా జరుపుకున్నారు. సంక్రాంతి ముగ్గులు, భోగి మంటలు వేశారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కళాశాల చైర్మన్ వి.వరలక్ష్మి, సెక్రటరీ సి.జక్కరయ్య, కరస్పాండెంట్ వి.రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ వి.హతిరామ్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ వి.వరలక్ష్మి మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో తమ కాలేజీలో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించగా, 50 మంది విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు.

విశాఖ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

కిటకిట

- సంక్రాంతి ప్రయాణాలతో ఆర్‌టిసి కాంప్లెక్స్, రైల్వే స్టేషన్‌లో విపరీత రద్దీ
- సెలవులు కలిసిరావడంతో సొంతూళ్లకు జనం పయనం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సంక్రాంతి ప్రయాణాలతో విశాఖలోని ద్వారకా బస్ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ శనివారం కిటకిటలాడాయి. అటు తెలంగాణతో పాటు ఇటు మన రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి సొంత ఊర్లకు బస్సుల్లో వస్తున్న ప్రయాణికులు, విశాఖ నుంచి సొంతూళ్లకు వెళ్తున్న ప్రయాణికులతో ద్వారకా బస్ కాంప్లెక్స్‌లో విపరీత రద్దీ నెలకొంది. ఈ నెల 11 నుంచి 19 వరకు పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిన నేపథ్యంలో సంక్రాంతి ప్రయాణాలు శుక్రవారం మొదలై.. శనివారం ఊపందుకున్నాయి. ఆదివారం ప్రయాణికుల సంఖ్య మరింత అధికంగా ఉంటుందని ఆర్‌టిసి అధికారులు భావిస్తున్నారు. ప్రయాణికుల డిమాండ్‌ను బట్టి ఆర్‌టిసి 174 బస్సులను ప్రత్యేకంగా నడుపుతోంది. ద్వారక బస్ స్టేషన్‌తోపాటు మద్దిలపాలెం బస్ స్టేషన్ నుంచి కూడా ప్రయాణాలు అధికంగా ఉన్నాయి. అంతేకాకుండా వివిధ రవాణా సాధనాల ద్వారా విశాఖ వచ్చినవారు చుట్టుపక్కలగల తమ స్వస్థలాలకు వెళ్లేందుకు ద్వారకా కాంప్లెక్స్‌నే ఆధారం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో టిక్కెట్లు జారీచేసే కౌంటర్ల వద్ద జనం బారులు తీరి కనిపించారు. ప్రయాణికుల రద్దీని గుర్తించిన అధికారులు అదనంగా మూడు కౌంటర్లు ఏ ర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ టికెట్ల అమ్మకాలు జరిగే ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా హైదరాబాద్, విజయవాడతో పాటు అమలాపురం, రాజమండ్రి, కాకినాడ, భీమవరంలకు, అలాగే శ్రీకాకుళం, విజయనగరం, నర్సీపట్నం వంటి ప్రాంతాలకు కూడా అదనపు బస్ సర్వీసులను కేటాయించినట్టు జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి బి.అప్పలనాయుడు 'ప్రజాశక్తి'కి తెలిపారు. రైల్వే స్టేషన్‌కు వెళ్లే వారి కోసం, అక్కడ నుంచి నగరానికి వస్తున్న వారి కోసం ప్రత్యేక బస్సులను అదనంగా వేసినట్టు వెల్లడించారు.

బస్సు ఛార్జీల పెంపు లేదు

సాధారణంగా సంక్రాంతి వంటి పండగల సమయంలో బస్సు ప్రయాణ ఛార్జీలను పెంచడం అనవాయతీగా వస్తోంది. అయితే ఈసారి బస్ టికెట్ ఛార్జీలను పెంచలేదని, సాధారణ రోజుల్లో ఎంత టికెట్ ధర ఉంటే అంత మాత్రమే వసూలు చేస్తున్నామని ఆర్‌ఎం అప్పలనాయుడు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో పరిస్థితి ఇలా..

సొంత ఊర్లకు వెళ్లే వారితో రైల్వే స్టేషన్ కూడా రద్దీగా మారింది. రెగ్యులర్‌గా నడిచే రైళ్లు కాకుండా, రద్దీని దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేసిన ప్రత్యేక రైళ్లు కూడా ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. రైళ్లలో కూర్చోవడానికి సీట్లు పొందడం కోసం ప్రయాణికులు మధ్య తోపులాటలు, ఘర్షణలు జరుగుతున్నాయి. ఆర్‌పిఎఫ్ సిబ్బంది ప్రతి రైలు వద్ద ప్రత్యేకంగా ఉండి తోపులాటలు, ఘర్షణలను నివారించే చర్యలు చేపడుతున్నారు. ఇటు ఆర్‌టిసి బస్ కాంప్లెక్స్, అటు రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారాలపై ఉన్న దుకాణాలు కొనుగోలుదారులతో రద్దీగా మారాయి. బస్ కాంప్లెక్స్‌లో తినుబండారాల ధరలను ఏ మాత్రమూ పెంచకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. రైల్వే స్టేషన్‌లో మాత్రం అటువంటి నిఘా లేకపోవడంతో అన్ని ఆహార దినుసులు, డ్రింక్స్ వగైరా వాటి ధరలు విపరీతంగా పెంచి వ్యాపారులు దోచుకుంటున్నారని పలువురు తెలిపారు.

గులాబీ రంగులో కాలీఫ్లవర్

ప్రజాశక్తి-సీలేరు : జికె.వీధి మండలం రింతాడ పంచాయతీ ఊబిల గ్రామానికి చెందిన గిరిజన రైతు కె.రామచంద్ర పొలంలో గులాబీ రంగు కాలీఫ్లవర్స్ విరబూశాయి. ఈ కాలీ ఫ్లవర్స్‌ను ప్రతి ఒక్కరూ తిలకిస్తున్నారు. గిరిజన రైతు కె.రామచంద్ర క్యాబేజీ, కాలీఫ్లవరు, ముల్లంగి, కొత్తిమీర ఇతర ఆకుకూరలు విస్తీరంగా పండిస్తున్నాడు. ఇప్పటివరకు తెలుపు వర్ణంలో ఉన్న కాలీఫ్లవరు, ఆకుపచ్చ వర్ణంలో ఉన్న బ్రోకోలి మన్యం వారపు సంతల్లో తరచూ చూస్తుంటాము. అయితే రామచంద్ర గులాబీ రంగు కాలీఫ్లవర్‌ను శాంపిల్‌గా నాటారు. అది వికసించి చూడముచ్చటగా కనిపిస్తోంది. గులాబీ రంగు కాలీఫ్లవర్‌పై వినియోగదారులు ఎక్కువ మక్కువ చూపుతారని రామచంద్ర తెలిపారు. అగ్రికల్చర్ అధికారులు ఇటువంటి పంటలపై రైతులకు పూర్తిస్థాయిలో సాగు విధానం, పంటలో మెలకువలు తెలియజేస్తే ఎక్కువ శాతం మంది గిరి రైతులు ముందుకు వస్తారని ఆయన తెలిపారు. ఇదే వర్ణంలో ఉన్న కాలీఫ్లవర్ పువ్వులను చింతపల్లిలో ఉపాధ్యాయులు సాగిన వీరన్న పడాల్ పెరటిలో పండిస్తున్నారు.

గులాబీ వర్ణంలో ఉన్న కాలీఫ్లవర్

ప్రైవేటు ట్రావెల్స్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-సీలేరు : పండగల పేరు చెప్పి ప్రయాణికుల నుండి అధిక చార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అల్లూరి జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కారే శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ కూలి పనులు, వివిధ రకాల ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లి సంక్రాంతి పండుగకు తమ సొంత గ్రామాలకు వస్తున్న వారు ప్రైవేట్ ట్రావెల్స్ అధిక చార్జీలు మేతతో బెంబేలెత్తిపోతున్నారని పేర్కొన్నారు. ఇలాగే ప్రైవేట్ ట్రావెల్స్ దందా కొనసాగితే ముందు ముందు వలస వెళ్లిన బీద ప్రజలు తమ సొంత గ్రామాలకు వచ్చే పరిస్థితి ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజలపై భారం పడకుండా తక్షణ చర్యలు చేపట్టి ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలపై కొరడా ఝులిపించాలని కోరారు. ప్రయాణ చార్జీలు ప్రభుత్వం నియంత్రించి ప్రయాణికులకు అందుబాటులో ఉండే బస్సు ఛార్జీలు వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉక్కులో కార్మికుల తొలగింపునకు కుట్ర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో విఆర్‌ఎస్ పేరుతో కార్మికులను తొలగించడానికి కుట్ర జరుగుతోందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఉపాధ్యక్షులు ఎస్.జ్యోతీశ్వరరావు తెలిపారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నాలుగేళ్లుగా కార్మికులు పెద్ద ఎత్తున పోరాడుతున్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 8న విశాఖపట్నం పర్యటన సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటిస్తారని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తారని ఎంతో ఆశగా కార్మిక వర్గం ఎదురు చూసిందని తెలిపారు. లక్షలాది మంది పాల్గొన్నటువంటి ఈ సభలో స్టీల్ ప్లాంట్ కోసం ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కనీసం ప్రస్తావించకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఇప్పుడు విఆర్‌ఎస్ పేరుతో కార్మికులను తొలగించేందుకు పూనుకోవడం సరికాదన్నారు. ప్లాంట్‌కు అవసరమైన ముడి సరుకులను, నిధులను సమకూర్చకుండా కార్మికులను తొలగించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. విఆర్‌ఎస్ నిర్ణయాన్ని తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంఖ్యను తగ్గించి స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు కంపెనీకి కట్టబెట్టాలని మోడీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని విమర్శించారు. ప్రధాని పర్యటన ముగిసిన వెంటనే విఆర్‌ఎస్ ప్రకటించడం, అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ కోసం సొంత గనులు కేటాయించాలని చంద్రబాబు కోరడం ఇవన్నీ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను దెబ్బతీయడం కోసమేనని నిర్ధారణ అయ్యిందన్నారు.